RNI. TGTEL/25/A1665


నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక



బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 95 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | మంగళవారం 06.10.2026 | పేజీలు : 8

ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..
- సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం


2

పుణెలో 'మచ్చర్ vs కాక్రోచ్' పోస్టర్ల రగడ..

- పుణే నగరంలో 'మచ్చర్, కాక్రోచ్' రాజకీయ పోస్టర్లతో కొత్త వివాదం
- ఫ్లైదుబాయ్ పైలట్ స్మిత్ మచ్చర్‌ను హీరోగా ప్రశంసిస్తూ ప్లెక్సీలు
- వ్యంగ్య నిరసన బృందం 'కాక్రోచ్ జనతా పార్టీ'ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు



2

'మా అనుమతి లేదు'.. ఫారమ్-6 పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

- ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటామన్న సీజేఐ
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ ఉంటుందని వెల్లడి
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టీకరణ


2

వారసత్వ కట్టడాల కూల్చివేతకు కుట్ర
- కేటీఆర్



- ఓపెన్‌కాస్ట్ ఏర్పాటుతో రామప్పకు ముప్పు..
- నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఉద్యమమే..
- 'ఎక్స్'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.

నిత్యం నిఘా, హైదరాబాద్ : మూడేండ్ల పాలనలో భూములను దోచుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఇప్పుడు భూమి లోపల ఉన్న సంపదను కొల్లగొట్టి వారసత్వ కట్టడాలను కూల్చేందుకు కుట్రలు చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ములుగు జిల్లాలోని రామప్ప ఆలయానికి అతి సమీపంలో ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని ఏర్పాటుకు సిద్ధంకావడం దారుణమని సోమవారం 'ఎక్స్' వేదికగా ఆయన ఖండించారు. ఓ పత్రిక కథనాన్ని తన పోస్ట్‌కు ట్యాగ్ చేసి సర్కార్ వైఖరిని ఎండగట్టారు. ఆలయ సమీపంలో తవ్వకాలు, బ్లాస్టింగ్ చేస్తే ..... మిగతా 2వ పేజీ లో..

గొంతెండిపోతున్న సచివాలయం

- సెక్రటేరియట్‌కు మంచినీటి సరఫరా నిలిపేసిన 4 ఏజెన్సీలు..
- రూ.50 లక్షల బకాయిలు చెల్లించకపోవడమే కారణం..?
- బిల్లులు క్లియర్ చేస్తేనే వాటర్ క్యాన్లు సరఫరా చేస్తాం
- తెగేసి చెప్పిన కాంట్రాక్టర్లు..!



నిత్యం నిఘా, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనకు గుండెకాయలాంటి సచివాలయానికి మంచినీటి సరఫరాను కాంట్రాక్టర్లు నిలిపేయడం సంచలనంగా మారింది. కాంట్రాక్ట్ సంస్థలు నీటి సరఫరా నిలిపేయడంతో సిబ్బందితోపాటు ఆయా పనుల నిమిత్తం వచ్చే సాధారణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. సచివాలయంలోని మంత్రుల పేషీలు, అనుబంధ కార్యాలయాలకు సరఫరా చేసిన తాగునీటి బిల్లులు భారీగా పెండింగ్‌లో ఉండటంతో ఏజెన్సీలు ప్రస్తుతం బంద్ పెట్టినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత మంత్రుల పేషీలు, అనుబంధ కార్యాలయాలకు 20 లీటర్ల ప్యూరిఫైడ్ వాటర్ క్యాన్లతోపాటు, రూ.7 విలువ గల చిన్న వాటర్ బాటిళ్లను నాలుగు కాంట్రాక్ట్ సంస్థలు సరఫరా చేస్తున్నాయి. ప్రభుత్వం ఆ ఏజెన్సీలకు చెల్లించాల్సిన మొత్తం రూ.50 లక్షలకు చేరినట్లు తెలిసింది. బకాయిల చెల్లింపుల విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తున్నట్లు తెలిసింది. బకాయిలు చెల్లించకపోతే సరఫరా నిలిపేస్తామని పలుమార్లు హెచ్చరించినా పెడచెవిన పెట్టినట్లు సమాచారం.. 2

రాజ్యసభ ఎన్నికలు
- కేంద్ర మంత్రులకు బీజేపీ షాక్.. అందరూ కొత్తవారే!



- యూపీ రాజ్యసభ ఎన్నికలకు 8 మంది అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ
- కేంద్ర మంత్రులు హర్దీప్ పురి, బీఎల్ వర్మలకు దక్కని అవకాశం
- పదవీకాలం ముగిసిన ఏ ఒక్క ఎంపీకి మళ్లీ టికెట్ ఇవ్వని అధిష్ఠానం

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : ఉత్తర ప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనూహ్య నిర్ణయం తీసుకుంది. పదవీకాలం ముగియనున్న ఇద్దరు కేంద్ర మంత్రులతో సహా ఏ ఒక్క సిట్టింగ్ ఎంపీకి తిరిగి అవకాశం కల్పించకుండా, ఎనిమిది మంది కొత్త ముఖాలను బరిలోకి దింపింది. ముఖ్యంగా కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పురి, బీఎల్ వర్మలను పక్కనపెట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉత్తరప్రదేశ్ నుంచి ఖాళీ అవుతున్న 10 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న పోలింగ్ జరగనుంది... 2

తెలంగాణలో డైనోసార్లు తిరిగాయా?
మంచిర్యాల అడవుల్లో దాగిన కోట్ల ఏళ్ల రహస్యం!

- వేమనపల్లి ప్రాంతంలో డైనోసార్ అవశేషాల గుర్తింపు
- 1984లో అవశేషాలు బయటపడినట్లు సమాచారం
- ప్రాణహిత పరివాహకంలో శిలాజాల ఆనవాళ్లు
- రాజారంలో కాకతీయుల కాలం నాటి విగ్రహాలు
- 12వ శతాబ్దానికి చెందిన దశావతార విగ్రహాలు


2

ధరల నియంత్రణలో సర్కార్ విఫలం
- హరీశ్‌రావు

- నాలుగు నెలల్లో 25% పెరిగిన బియ్యం ధరలు..
- పౌరసరఫరాల శాఖ నిద్రపోతోందా?
- ఉత్పత్తి పెరిగితే ధరలు ఎందుకు ఆకాశాన్నంటుతున్నాయి?
- నిత్యావసరాల నియంత్రణలో కాంగ్రెస్ విఫలం
- సామాన్యుడిపై ధరల భారం
- సన్నబియ్యం ధరలపై సర్కార్ నేలచూపులు : హరీశ్‌రావు



నిత్యం నిఘా, హైదరాబాద్ : సన్నబియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతుంటే నియంత్రించాల్సిన రేవంత్‌రెడ్డి సర్కార్ నేల చూపులు చూస్తున్నదని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. నిత్యావసరాల ధరలను అరికట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని సోమవారం 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. బియ్యం, నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యులు ఉక్కిరిబిక్కిరవుతుంటే పౌరసరఫరాల శాఖ మొద్దునిద్ర నటిస్తున్నదని దుయ్యబట్టారు. నాలుగు నెలల్లో సన్నబియ్యం ధరలు 25% పెరుగడం కనిపించడం లేదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రికార్డుస్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని సర్కార్ గొప్పలు చెప్పుకొంటున్నది. మరి, ఉత్పత్తి పెరిగినప్పుడు బియ్యం ధరలు ఎందుకు చుక్కలను అంటుతున్నాయి? మీరు ఇస్తున్న సన్నబియ్యం పథకం సఫలమైతే బియ్యం ధరలు అదుపు తప్పుతున్నాయెందుకు ?'అని హరీశ్‌రావు నిలదీశారు.

కేబీఆర్ పార్క్ చుట్టూ ఇక శాశ్వతంగా వన్‌వే : జీహెచ్ఎంసీ కమిషనర్

- కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్‌ను శాశ్వతం చేసిన జీహెచ్ఎంసీ
- పాత ప్రాజెక్టులో మార్పులతో ప్రభుత్వానికి రూ.400 కోట్ల ఆదా
- నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు కొత్త స్టీల్ ఫ్లైఓవర్



నిత్యం నిఘా, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న వన్-వే ట్రాఫిక్ విధానాన్ని శాశ్వతం చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం ప్రకటించారు. దీనితో పాటు, ఈ ప్రాంతంలో గతంలో ప్రతిపాదించిన హెచ్-సిటీ ఇన్‌ఫ్రా పనుల్లో కొన్నింటిని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు రూ. 400 కోట్ల మేర ప్రజాధనం ఆదా కానుంది. సోమవారం కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మార్గాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించిన అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడారు.
వన్-వే విధానం, ఫ్రీ-లెఫ్ట్ టర్న్‌ల ఏర్పాటు వల్ల ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, వాహనాల రాకపోకలు మెరుగుపడ్డాయని ఆయన తెలిపారు. 2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సచివాలయం గొంతెండుతోంది ..?

మొదటిపేజీ తరువాయి.. తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో సచివాలయ సిబ్బందిని ఇండ్ల నుంచే వాటర్ బాటిళ్లు తెచ్చుకోవాలని అధికారులు సూచించినట్లు తెలిసింది. ఈ వ్యవహారం సచివాలయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. ఇటీవల బిల్లులు చెల్లించలేదనే కారణంగా మధ్యాహ్న భోజనాన్ని సైతం కాంట్రాక్టర్లు నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు సరఫరా నిలిచిపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటిలోగా బకాయిలు చెల్లిస్తారో.. ఎప్పటినుంచి మంచినీటి సరఫరా పునరుద్ధరిస్తారోనని ఉద్యోగులు సోమవారం చర్చించుకోవడం క నిపించింది. బకాయిలు చెల్లిస్తేనే ప్యూరిఫైడ్ వాటర్ సైప్లె చేస్తామని కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి తేల్చిచెప్తున్నారు. కాంగ్రెస్ ఏలుబడిలో ప్రభుత్వ పరిపాలనా కేంద్రమైన సచివాలయానికే మంచినీటి బకాయిల కారణంగా నీటి సరఫరా నిలిచిపోవడం సచివాలయ వర్గాలతోపాటు, సచివాలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే సంద ర్శకుల్లో హాట్ టాపిక్‌గా మారింది. అధికారులు మాత్రం ఈ అంశంపై స్పందించకపోవడం గమనార్హం.

వారసత్వ కట్టడాల కూల్చివేతకు కుట్ర - కేటీఆర్

మొదటిపేజీ తరువాయి.. శిల్పకళకు ప్రతిరూపమైన, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యలకు బీఆర్ఎస్ వ్యతిరేకమని స్పష్టంచేసిన కేటీఆర్.. రామప్ప ఆలయానికి హానిచేసే ఓసీ బొగ్గు గని ఏర్పాటు ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

కేబీఆర్ పార్క్ చుట్టూ ఇక శాశ్వతంగా వన్‌వే : జీహెచ్ఎంసీ కమిషనర్

మొదటిపేజీ తరువాయి.. సవరించిన ప్రణాళిక ప్రకారం, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు వరుసల స్టీల్ బ్రిడ్జి (ఫ్లైఓవర్) నిర్మిస్తామని, దీనిని ఏడాది కాలంలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే కేబీఆర్ పార్క్ సమీపంలో ఒక అండర్‌పాస్‌ను కూడా నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో హెచ్-సిటీ ప్రాజెక్టు కింద రూ. 1,090 కోట్ల అంచనా వ్యయంతో కేబీఆర్ పార్క్ చుట్టూ పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మాణాన్ని ప్రతిపాదించారు. అయితే, ప్రస్తుతం అమలు చేస్తున్న వన్-వే విధానం విజయవంతం కావడం, కోర్టు కేసుల వంటి పరిణామాల నేపథ్యంలో అధికారులు ఈ ప్రణాళికలను పునఃసమీక్షించారు. ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు అత్యవసరమైన చోట మాత్రమే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మార్పుల ద్వారా నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, పెద్ద ఎత్తున ప్రజాధనం ఆదా అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

తెలంగాణలో డైనోసార్లు తిరిగాయా?

మంచిర్యాల అడవుల్లో దాగిన కోట్ల ఏళ్ల రహస్యం!

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ అంటే చారిత్రక కోటలు, దేవాలయాలు, పచ్చని అడవులు గుర్తొస్తాయి. కానీ.. ఈ నేలపై కోట్ల ఏళ్ల క్రితం డైనోసార్లు సంచరించాయంటే నమ్మగలరా? మంచిర్యాల జిల్లాలోని వేమనపల్లి ప్రాంతం అలాంటి ఆసక్తికర విషయాలను తనలో దాచుకుంది. ప్రాణహిత నది పరీవాహక ప్రాంతంలో డైనోసార్ అవశేషాలు, వివిధ జీవుల శిలాజాలు బయటపడినట్లు స్థానిక కథనాలు చెబుతున్నాయి. అదే ప్రాంతంలో కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆనవాళ్లు కూడా ఉండటం విశేషం. మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ప్రాణహిత నది ప్రవహించే ప్రాంతమే వేమనపల్లి. 1984లో మంగెనపల్లి అటవీ ప్రాంతంలో భూగర్భ, పురావస్తు శాఖ అధికారులు డైనోసార్ అవశేషాలను గుర్తించారు. సుమారు 14 మీటర్ల పొడవు, 5.5 మీటర్ల ఎత్తు ఉన్న జీవికి చెందిన అవశేషాలు బయటపడటంతో అప్పట్లో సంచలనం రేగింది. సుంపుటం, ఒడ్డుగూడెం, మంగెనపల్లి ప్రాంతాల్లోనూ అవశేషాలు లభించినట్లు స్థానికులు చెబుతున్నారు. వేమనపల్లి పరిసరాల్లో శిలాజీకరణ చెందిన చెట్ల ఆనవాళ్లు కూడా కనిపిస్తాయని స్థానికులు చెబుతున్నారు. వాగులు, నది మలుపుల వెంట వివిధ ఆకారాల్లో రాళ్లు కనిపిస్తుంటాయి. వాటిలో కొన్ని చేపలు, సముద్ర నక్షత్రాలు, తాబేళ్ల ఆకారాలను పోలి ఉంటాయని చెబుతున్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో చెట్లు ఇసుక పొరల్లో కూరుకుపోయి.. చాలా కాలానికి శిలాజాలుగా మారి ఉండొచ్చని భావిస్తున్నారు. వేమనపల్లి ప్రత్యేకత డైనోసార్లతోనే ఆగిపోలేదు. రాజారం గ్రామంలోని దశావతార విగ్రహాలు సుమారు 12వ శతాబ్దానికి చెందినవిగా భావిస్తున్నారు. ఇవి కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆనవాళ్లుగా గుర్తింపు పొందాయి. అంటే.. ఒకవైపు కోట్ల ఏళ్ల క్రితం జీవించిన జీవుల ఆనవాళ్లు.. మరోవైపు శతాబ్దాల క్రితం మనుషులు నిర్మించిన చారిత్రక గుర్తులు ఇక్కడ కనిపిస్తాయి. ప్రాణహిత నది, దట్టమైన అడవులు, అరుదైన వృక్షజాతులు, శిలాజాలు, డైనోసార్ అవశేషాలు, కాకతీయుల కాలం నాటి విగ్రహాలు.. ఇలా వేమనపల్లిలో ప్రకృతి, చరిత్ర, భూగర్భ రహస్యాలు ఒకే చోట కనిపిస్తాయి. ఈ ప్రాంతంలోని పురాతన ఆనవాళ్లపై మరింత శాస్త్రీయ పరిశోధన జరిగితే తెలంగాణ గతానికి సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

రాజ్యసభ ఎన్నికలు: కేంద్ర మంత్రులకు బీజేపీ షాక్..

మొదటిపేజీ తరువాయి..
అసెంబ్లీలోని బలాబలాల ప్రకారం బీజేపీ ఎనిమిది, సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ తన ఎనిమిది మంది అభ్యర్థుల జాబితాను సోమవారం విడుదల చేసింది. ధర్మపాల్ సింగ్, రాధాకాంత్ ఓఝా, ప్రకాశ్ పాల్, విద్యాసాగర్ సోన్‌కర్, గోపీ కృష్ణ పాండే, ప్రియాంక సింగ్ రావత్, రామ్ ప్రతాప్ సింగ్ చౌహాన్, శ్రుతి గంగ్వార్‌లను అభ్యర్థులుగా అధిష్ఠానం ప్రకటించింది.

2027 ఎన్నికలే లక్ష్యంగా ఎంపిక
2027లో జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ ఈ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు స్పష్టమవుతోంది. సామాజిక సమీకరణాలతో పాటు పార్టీ సంస్థాగత అనుభవానికి ఇందులో పెద్దపీట వేశారు. ఈ జాబితాలో ముగ్గురు ఓబీసీ, ఇద్దరు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ), ముగ్గురు అగ్రవర్ణాల అభ్యర్థులు ఉన్నారు. వీరిలో ఇద్దరు మహిళలకు అవకాశం కల్పించడం విశేషం. బారాబంకి మాజీ ఎంపీ ప్రియాంక సింగ్ రావత్, ఝార్ఖండ్ గవర్నర్ సంతోష్ గంగ్వార్ కుమార్తె శ్రుతి గంగ్వార్‌లను మహిళా అభ్యర్థులుగా ఎంపిక చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్ పాల్, ప్రముఖ దళిత నేత, మాజీ ఎంపీ విద్యాసాగర్ సోన్‌కర్, అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండుసార్లు పనిచేసిన రాధాకాంత్ ఓఝా వంటి వారికి ఈ జాబితాలో చోటు దక్కింది. ఈ నిర్ణయంతో పార్టీలో కింది స్థాయి నుంచి పనిచేస్తున్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు బీజేపీ సంకేతాలు పంపింది.

ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

మొదటిపేజీ తరువాయి..
తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

పుణెలో 'మచ్చర్ VS కాక్రోచ్' పోస్టర్ల రగడ..

మొదటిపేజీ తరువాయి..
మహారాష్ట్రలోని పుణే నగరంలో వెలసిన కొన్ని పోస్టర్లు ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. "మచ్చర్ లా ఉండండి, కాక్రోచ్‌లా కాదు" అనే వింత నినాదంతో ఏర్పాటు చేసిన ఈ పోస్టర్లు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఒకవైపు ఫ్లైదుబాయ్ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను హీరోగా చూపిస్తూ, మరోవైపు 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) అనే వ్యంగ్య నిరసన బృందాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ పోస్టర్లను ప్రదర్శించారు. 'భారతీయ జనతా యువ మోర్చా' (బీజేవైఎం) ఈ పోస్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

ఎవరీ కెప్టెన్ మచ్చర్?
గత సెప్టెంబర్ నెలలో దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఒక అనూహ్య ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా, సహ పైలట్.. కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ క్లిష్ట పరిస్థితుల్లో కెప్టెన్ మచ్చర్ అప్రమత్తమై, విమానాన్ని తిరిగి తన ఆధీనంలోకి తెచ్చుకుని సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీంతో ఆయన ధైర్యసాహసాలను అందరూ ప్రశంసించారు. హిందీలో 'మచ్చర్' అంటే 'దోమ' అని అర్థం. ఆయన ఇంటిపేరును వాడుకుంటూ, ఆయనను సానుకూల దృక్పథానికి ప్రతీకగా ఈ పోస్టర్లలో చూపించారు.

ఏమిటీ 'కాక్రోచ్ జనతా పార్టీ'?
గత సెప్టెంబర్ నెలలో దుబాయ్ ఇక 'బొద్దింక' ప్రస్తావన వెనుక కూడా ఒక నేపథ్యం ఉంది. ఈ ఏడాది మే నెలలో కొందరు ఉద్యమకారులు, నిరుద్యోగ యువతను ఉద్దేశించి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ 'బొద్దింకలు' అని వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, తన మాటలను తప్పుగా ప్రచురించారని ఆయన తర్వాత స్పష్టం చేశారు.

ఈ వివాదాన్ని ఆధారంగా చేసుకుని అభిజీత్ దీప్కే అనే సామాజిక కార్యకర్త 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో ఆన్‌లైన్‌లో ఒక వ్యంగ్య బృందాన్ని ప్రారంభించారు. పరీక్ష పత్రాల లీకేజీలు, ప్రభుత్వ పాఠశాలల దుస్థితి వంటి అంశాలపై ఈ బృందం వినూత్నంగా నిరసనలు తెలుపుతూ గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలోనే సీజేపీని కించపరిచేలా, కెప్టెన్ మచ్చర్‌ను హీరోగా చూపిస్తూ ఈ పోస్టర్లు వెలిశాయి. ఒక పైలట్ సాధించిన వ్యక్తిగత ఘనతను, ఆయన ఇంటిపేరును ఇలా రాజకీయ వివాదంలోకి లాగడంపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వింత పోస్టర్ల వివాదం పుణేలో స్థానిక రాజకీయ వేడిని పెంచడంతో పాటు సాహస పైలట్ కెప్టెన్ మచ్చర్‌తో పాటు సీజేపీని కూడా జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిపింది.

'మా అనుమతి లేదు'..

ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

మొదటిపేజీ తరువాయి..
కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. ''సవరించిన ఫారమ్-6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం'' అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్-6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. గత 10 నెలల్లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

మంగళవారం 06 - 10 - 2026

నిత్యం నిఘా తెలుగు దినపత్రిక

“జన తెలంగాణ” దిశగా కొత్త రాజకీయ అడుగు

- ప్రజా సమస్యలే మా ఎజెండా.. విద్య, వైద్యం, ఉపాధిపై పోరాటం
- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా రాజకీయ వేదిక
- ఉమ్మడి జిల్లాల కేంద్రంగా సన్నాహక సమావేశాలు..
- రెండు మూడు నెలల్లో పార్టీ పేరు ఖరారు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి సన్నాహాలు
- మాజీ మావోయిస్టు నేత, తెలంగాణ ఉద్యమకారుడు లంకా పాపిరెడ్డి



హన్మకొండ, అక్టోబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) :



తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా ప్రజలు ఆశించిన మార్పు పూర్తిస్థాయిలో రాలేదని, ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన త్యాగాల ఆకాంక్షలు నెరవేరలేదని మాజీ మావోయిస్టు నేత, తెలంగాణ ఉద్యమకారుడు లంకా పాపిరెడ్డి అన్నారు. ప్రజల మౌలిక సమస్యలైన విద్య, వైద్యం, ఉపాధిని కేంద్రంగా చేసుకుని కొత్త రాజకీయ వేదికను నిర్మించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక పద్ధతిలో రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన తన ఉద్యమ ప్రస్థానం, తెలంగాణ ఉద్యమ అనుభవాలు, రాష్ట్ర పరిస్థితులు, కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడారు.

‘తెలంగాణ ఆకాంక్షలు పూర్తిగా నెరవేరలేదు’



తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు వస్తుందని, రాష్ట్ర వనరులు ప్రజలకే ఉపయోగపడతాయని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, విద్య, వైద్యం అందరికీ అందుబాటులోకి వస్తాయని ఆశించామని పాపిరెడ్డి తెలిపారు. అయితే ఆ ఆకాంక్షలు పూర్తిగా నెరవేరలేదన్నారు.

ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంతోమంది త్యాగాలు చేశారని, ప్రజలు అనేక పోరాటాలు చేశారని చెప్పారు. తాను కూడా 2009 నుంచి తెలంగాణ ఉద్యమంలో క్షేత్రస్థాయిలో పనిచేశానని, అనేక ప్రాంతాల్లో పర్యటించి తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వ్యాసాల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లానని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం, ఇతర ప్రజా సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలను మరోసారి చైతన్య పరచాల్సిన అవసరం ఉందన్నారు.

వ్యవసాయం, పరిశ్రమలపై దృష్టి



తెలంగాణలో వ్యవసాయం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, పరిశ్రమలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని పాపిరెడ్డి అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లోనూ సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు బలోపేతం కాకుండా కేవలం సేవల రంగంపై ఆధారపడటం వల్ల ప్రజలకు శాశ్వత ఉపాధి, ఆదాయ భద్రత కల్పించలేమన్నారు.

పాలకులు ప్రజా ప్రయోజనాల కంటే కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, అందుకే ప్రత్యేక కార్యాచరణతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.

విద్య, వైద్యం, ఉపాధే ప్రధాన ఎజెండా

ప్రజలకు అత్యంత అవసరమైన విద్య, వైద్యం, ఉపాధి రంగాలపై ప్రధానంగా దృష్టి సారిస్తామని పాపిరెడ్డి తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ వైద్య వ్యవస్థను మెరుగుపరచాలని అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజా సమస్యలపై మళ్లీ ఉద్యమాలు నిర్మించాలని, విద్య, వైద్యం, ఉపాధి కోసం పోరాటాలు చేయాలని చెప్పారు. డబ్బు ఒక్కటే రాజకీయాలకు ప్రాతిపదిక కాదని, నిజాయితీగా పనిచేస్తే ప్రజలే ఉద్యమాలకు అండగా నిలుస్తారని అన్నారు.

‘ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఏర్పాటు చేస్తాం’

కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక పద్ధతిలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు పాపిరెడ్డి తెలిపారు. ప్రజాస్వామికవాదులు, వివిధ సామాజిక వర్గాలు, ప్రజా సమస్యలపై పోరాడుతున్న వ్యక్తులను ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యమన్నారు.

తెలంగాణ వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల కేంద్రంగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. అన్ని వర్గాల నుంచి స్పందన వస్తోందన్నారు. వ్యవసాయం, పరిశ్రమల అభివృద్ధితో పాటు విద్య, వైద్యం, ఉపాధికి ప్రాధాన్యం ఇచ్చేలా కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

‘జన తెలంగాణ’ లక్ష్యంగా ముందుకు

కొత్త రాజకీయ వేదిక ఒక్క వ్యక్తి లేదా ఒక వర్గానికి పరిమితం కాదని పాపిరెడ్డి అన్నారు. ప్రజల కోసం పనిచేయాలనుకునే ప్రజాస్వామికవాదులు, వివిధ సామాజిక వర్గాలు, ప్రజా సమస్యలపై పోరాడుతున్న వ్యక్తులను ఒకే వేదికపైకి తీసుకురావాలన్నదే తమ ఉద్దేశమన్నారు.



ఉమ్మడి జిల్లాల కేంద్రంగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సమస్యలనే రాజకీయ ఎజెండాగా మార్చి, ప్రజలను చైతన్యపరచి ఉద్యమాలను నిర్మించాలన్నారు. తెలంగాణ కోసం జరిగిన త్యాగాల ఆకాంక్షలను సాధించే దిశగా తమ రాజకీయ ప్రయాణం సాగుతుందని చెప్పారు.

ఉద్యమ నేపథ్యం నుంచి రాజకీయ ప్రయాణం

తన కుటుంబ నేపథ్యం, ఉద్యమ ప్రస్థానాన్ని పాపిరెడ్డి వివరించారు. దామెర మండలం తక్కళ్లపాడుకు చెందిన తాను వరంగల్ ఆజంజాహి మిల్స్ కాలనీ సమీపంలోని గాంధీనగర్‌లో పెరిగినట్లు తెలిపారు. తన తండ్రి లక్ష్మీకాంతం స్వాతంత్ర్య సమరయోధుడని, కుటుంబంలో ఉన్న వామపక్ష భావజాల ప్రభావం తనపై పడిందని చెప్పారు.

తన అన్న మురళీమోహన్‌రెడ్డి విద్యార్థి దశలో వామపక్ష ఉద్యమంలోకి వెళ్లారని, అత్యవసర పరిస్థితుల సమయంలో మెదక్ జిల్లా గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌లో 19 ఏళ్ల వయసులో మరణించారని తెలిపారు. అనంతరం తాను కూడా ఉద్యమ భావజాలం వైపు వెళ్లినట్లు వివరించారు.

1976లో అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిన తనను పోలీసులు అరెస్టు చేసి మూడు నెలల పాటు జైలులో ఉంచారని తెలిపారు. 1981లో మళ్లీ అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లి పీపుల్స్‌వార్ ఉద్యమంలో వివిధ బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్ బస్తర్‌తో పాటు హర్యానా తదితర ప్రాంతాల్లో పనిచేశానన్నారు.

అనారోగ్య కారణాలతో 2008లో అప్పటి హోంశాఖ మంత్రి జానారెడ్డి సమక్షంలో లొంగిపోయినట్లు తెలిపారు. అనంతరం 2009 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నానని చెప్పారు. ప్రజా సమస్యలను అధ్యయనం చేస్తూ ఇప్పుడు కొత్త రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుడుతున్నామని వెల్లడించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ



ప్రజలను చైతన్యపరచడం, ప్రజా ఉద్యమాలను నిర్మించడం ప్రస్తుతం తమ ప్రధాన లక్ష్యమని పాపిరెడ్డి తెలిపారు. పార్టీ నిర్మాణ ప్రక్రియ కొనసాగుతోందని, రానున్న రెండు మూడు నెలల్లో పార్టీ పేరు పూర్తిస్థాయిలో ఖరారయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజాస్వామికవాదులు, వివిధ వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని, అందుకోసమే ‘జన తెలంగాణ’ దిశగా తమ ప్రయాణం ప్రారంభమైందని చెప్పారు. ప్రజల సమస్యలే తమ ఎజెండా, ప్రజలే తమ బలమని పేర్కొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

హనుమకొండలో విజయ డెయిరీ విక్రయ కేంద్రాలు ప్రారంభం

- బస్టాండ్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వద్ద కేంద్రాలు ఏర్పాటు
- ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు అందుబాటులోకి రావడం అభినందనీయం: ఎమ్మెల్యే నాయిని, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి







హనుమకొండ, అక్టోబర్05 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ నగరంలో విజయ డెయిరీ పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ విజయ డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను వరంగల్ పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సోమవారం ప్రారంభించారు. హనుమకొండ బస్టాండ్ ఆవరణలో, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాలను ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి ప్రారంభించారు. అనంతరం కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన వివిధ రకాల పాల ఉత్పత్తులను పరిశీలించి, వాటి విక్రయ విధానం, ఉత్పత్తుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడంలో విజయ డెయిరీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులు, సిబ్బందికి విజయ డెయిరీ ఉత్పత్తులు సులభంగా అందుబాటులో ఉండేలా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని సౌకర్యవంతమైన ప్రాంతాల్లో ఇలాంటి విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి విజయ డెయిరీ ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతాల్లో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యమైన పాల ఉత్పత్తులను సులభంగా పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు.అనంతరం విజయ డెయిరీ సిబ్బందితో ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడి విక్రయ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఉత్పత్తులు, విక్రయ విధానం తదితర వివరాలను తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందేలా అవసరమైన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ డీడీ ధనరాజ్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ లక్ష్మి , రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు

- యూనిఫామ్‌ల పంపిణీలో సర్పంచ్ పసుల కార్తీక్



ములుగు జిల్లా/ జేడీ మల్లంపల్లి, అక్టోబర్05 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రభుత్వం అందిస్తున్న విద్యా సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సర్పంచ్ పసుల కార్తీక్ అన్నారు. ములుగు జిల్లా జేడీ మల్లంపల్లి మండలంలోని మహమ్మద్ గౌస్‌పల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఆయన యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువుకునేలా పాఠశాలల్లో అనుకూల వాతావరణం కల్పించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు.విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించడం ద్వారా వారిలో సమానత్వ భావన పెంపొందడంతో పాటు తల్లిదండ్రులపై ఆర్థిక భారం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ భారీ పాదయాత్ర

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే





హనుమకొండ , అక్టోబర్ 05(నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలో భారీ పాదయాత్ర నిర్వహించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కలిసి అంబేద్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర సాగింది. ఈ పాదయాత్రలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ గుండు సుధారాణి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. పాదయాత్రకు ముందు కేఆర్ నాగరాజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ప్రతి ఓటు ప్రజల హక్కుకు ప్రతీక అని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై తమకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని పేర్కొన్న ఆయన, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర ప్రధాన రహదారుల మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. నాయకులు, కార్యకర్తలు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి, ఓటు హక్కును పరిరక్షించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుద్దిళ్ల శ్రీనుబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి రవళి రెడ్డి, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, డివిజన్, గ్రామస్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ కమిటీల చైర్మన్లు, డివిజన్ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, యువజన, మహిళా నాయకులు, కార్యకర్తలు, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాకతీయ డిగ్రీ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలి

- కలెక్టర్‌కు విద్యార్థి సంఘాల వినతి.. తాగునీరు, తరగతి గదుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



హన్మకొండ, అక్టోబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి): హన్మకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం సమర్పించారు. కళాశాలకు సుదీర్ఘకాలంగా రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడంతో పాలనాపరమైన సమస్యలు ఏర్పడటంతో పాటు విద్యార్థుల విద్యాబోధనపై ప్రభావం పడుతోందని వారు తెలిపారు.కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తాగునీటి సౌకర్యం కూడా సక్రమంగా అందుబాటులో లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇన్‌చార్జి పాలన కారణంగా పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పేర్కొన్నారు.కళాశాలకు వెంటనే పూర్తిస్థాయి రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని, విద్యార్థులకు అవసరమైన అదనపు తరగతి గదులను నిర్మించాలని కోరారు. తాగునీటి సమస్యను పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు, విద్యా వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన కలెక్టర్ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సాయికుమార్‌తో పాటు పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రిలో లంచాల ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి

- పేద, గిరిజన ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్.రవి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తోలెం కృష్ణయ్య



ఏటూరునాగారం, అక్టోబర్05 (నిత్యం నిఘా ప్రతినిధి): ఏజెన్సీ ప్రాంతంలోని పేద, గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ఏటూరునాగారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు, ఇతర ప్రభుత్వ సేవల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి టి.ఎల్.రవి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తోలెం కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వారు దరఖాస్తు సమర్పించారు.ఏటూరునాగారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చుట్టుపక్కల ఐదు, ఆరు మండలాల నుంచి ప్రతిరోజూ వందలాది మంది పేద, గిరిజన ప్రజలు వైద్యం కోసం వస్తుంటారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందించాల్సిన వైద్య సేవలకు సంబంధించి కొంతమంది సిబ్బంది రోగులు, వారి కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు ప్రజల నుంచి వస్తున్నాయని పేర్కొన్నారు. జనన ధ్రువీకరణ పత్రాలు, ఇతర ప్రభుత్వ సేవల విషయంలోనూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. ఈ ఆరోపణలపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి వాస్తవాలను తేల్చాలని కోరారు. రోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజల నుంచి ఫిర్యాదులు, వాంగ్మూలాలు స్వీకరించాలని సూచించారు. ఆసుపత్రిలో ఉచితంగా అందించే వైద్య, ఇతర సేవల వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పేద, గిరిజన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి, విచారణ అనంతరం తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారులకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులు పేద, గిరిజన ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా వైద్య కేంద్రాలుగా పనిచేయాలని, ఆరోగ్య సేవల్లో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా అధికారుల పర్యవేక్షణను మరింత పెంచాలని టి.ఎల్.రవి, తోలెం కృష్ణయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ, జిల్లా ఉపాధ్యక్షుడు కోగిల బాలు తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో ఘనంగా కాకా వెంకటస్వామి జయంతి

- పుట్ట మధూకర్ ఆదేశాలతో బీఆర్ఎస్ శ్రేణుల ఘన నివాళి



పెద్దపల్లి జిల్లా/ మంథని, అక్టోబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి): మాజీ ఎంపీ, ప్రముఖ దళిత నేత దివంగత గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం మంథని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ మంథని మండల అధ్యక్షుడు ఎగోళపు శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.మంథని పట్టణంలోని గడ్డం వెంకటస్వామి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి, తెలంగాణకు ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ పుప్పాల భాగ్యలక్ష్మి తిరుపతి మాట్లాడుతూ గడ్డం వెంకటస్వామి కార్మిక నాయకుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా దేశానికి విశేష సేవలు అందించారని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతితో పాటు కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు.అభిమానంతో 'కాకా' అని పిలుచుకునే వెంకటస్వామి తెలంగాణ ఉద్యమంతో పాటు దళిత, బహుజన ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలు, సేవలు, ఆదర్శాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వెంకటస్వామి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

భద్రాచలం ఏరియా ఆసుపత్రికి రూ.15 లక్షల వైద్య పరికరాలు

- పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు





భద్రాచలం, అక్టోబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి): భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రూ.15 లక్షల విలువైన వైద్య పరికరాలను భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అందజేశారు. ఐటీడీఏ నిధులతో సమకూర్చిన పరికరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్‌రెడ్డికి అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి, నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అందుబాటులోకి వచ్చిన వైద్య పరికరాలను సద్వినియోగం చేసుకుని రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని కోరారు.ఐటీడీఏ పీఓ బి.రాహుల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రికి అందించిన పరికరాలతో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.ఐటీడీఏ నిధులతో కంటి పరీక్షలు, రక్త పరీక్షలు, ఈసీజీ నిర్వహణకు అవసరమైన యంత్రాలతో పాటు ఆక్సిజన్ సిలిండర్లు తదితర వైద్య పరికరాలను ఆసుపత్రికి అందజేశారు.కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ జగదీష్, డాక్టర్ మల్లేష్, పార్టీ నాయకులు నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, యువజన నాయకులు గాడి విజయ్, మాచినేని భాను, ఎం.డి.సుభాని, కొప్పుల వంశీతో పాటు ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీణవంకలో ప్రజల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యత

- ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కరీంనగర్ జిల్లా / జమ్మికుంట, అక్టోబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో వీణవంక గ్రామంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ దాసారపు సరోజన–రాజేందర్ ప్రసాద్ ప్రత్యేక చొరవతో, మైత్రి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో గ్రామపంచాయతీ పరిధిలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.శిబిరంలో గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అవసరమైన వారికి వైద్యుల సూచనలు, ఆరోగ్య సలహాలు అందించారు. రక్తపోటు తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు.గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందడం ఎంతో అవసరమని నిర్వాహకులు తెలిపారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా సర్పంచ్ దాసారపు సరోజన–రాజేందర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే తమకు ప్రధాన ప్రాధాన్యత అని తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి ఆరోగ్య శిబిరాలను మరింతగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి కుటుంబానికి అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఆరోగ్యం, పారిశుధ్యం, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహణకు సహకరించిన మైత్రి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేవైఎం హనుమకొండ జిల్లా మన్ కీ బాత్ కన్వీనర్‌గా వీరేశం

- ప్రతి బూత్‌లో ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని నిర్వహించడమే లక్ష్యం



వరంగల్ / సంగెం, అక్టోబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి): భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) హనుమకొండ జిల్లా 'మన్ కీ బాత్' కన్వీనర్‌గా దామెరుప్పుల వీరేశం నియమితులయ్యారు. ఈ మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో, ప్రతి బూత్ స్థాయిలో విజయవంతంగా నిర్వహించి యువతను భాగస్వాములను చేయాలని వీరేశానికి సూచించారు.ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, సంగెం మండల అధ్యక్షుడు చంద్రమౌళి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.వీరేశం నియామకం పట్ల బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

ఇంద్రానగర్‌లో బీజేపీలోకి యువత చేరిక

- వార్డు సభ్యుడితో పాటు పలువురు యువకులకు పార్టీ కండువాలు





ఎల్కతుర్తి, అక్టోబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్కతుర్తి మండలం ఇంద్రానగర్ గ్రామంలో పలువురు యువకులు బీజేపీలో చేరారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై వార్డు సభ్యుడితో పాటు పలువురు యువకులు పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. ఇంద్రానగర్ మాజీ సర్పంచ్ కడారి ప్రసాద్, నమిండ్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎల్కతుర్తి మండల బీజేపీ అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ నూతనంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి బీజేపీ కృషి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని, యువత ప్రజా సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరడంతో ఇంద్రానగర్‌లో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. రాబోయే రోజుల్లో గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో సందేలా మధు, సందేలా చందు, గొర్రె చరణ్, కడారి అఖిల్, వూట్కూరి రాకేష్, కోడూరి అభి సాకేత్, సుర వినయ్, నక్క రాకేష్, ముడుతనపల్లి కిరణ్, కోడూరి హర్ష వర్ధన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎల్కతుర్తి మండల ప్రధాన కార్యదర్శి చీదురాల వెంకటేష్, సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య, ముషికే వెంకటేష్, జనగాని కిష్టయ్య, ఆడెపు శ్రీ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంహెచ్ హాస్టల్ కార్మికుల 11 నెలల వేతనాలు విడుదల చేయాలి

- వేతనాలు అందక పండుగ పూట పస్తులుండే పరిస్థితి: సీఐటీయూ



ఏటూరునాగారం, అక్టోబర్05 (నిత్యం నిఘా ప్రతినిధి): ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని పీఎంహెచ్ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔటసోర్సింగ కార్మికుల 11 నెలల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోకు కార్మికులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రత్నం రాజేందర్ మాట్లాడుతూ 11 నెలలుగా వేతనాలు అందక ఔట్‌సోర్సింగ్ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పండుగల సమయంలోనూ కుటుంబాలను పోషించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతోనే వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు.వేతనాల కోసం అధికారులను సంప్రదిస్తే ఆర్థిక శాఖ వద్ద చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఔట్‌సోర్సింగ్ కార్మికుల విషయంలో ఆ నిర్ణయం అమలుకు నోచుకోవడం లేదని అన్నారు.కార్మికుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే కార్మికులతో కలిసి ఆందోళన, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో పీఎంహెచ్ హాస్టల్ కార్మికులు సుజాత, సుగుణ, స్వరూప, కవిత, పోషాలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌లో ప్రజల సమస్యలపై పీఓ దృష్టి

- 30 దరఖాస్తులు స్వీకరణ.. త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు



ఏటూరునాగారం, అక్టోబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి): ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గిరిజన దర్బార్‌లో మొత్తం 30 దరఖాస్తులు అందాయి. ఇందిరా జల ప్రభకు సంబంధించి ఎనిమిది దరఖాస్తులు రాగా, ఆర్‌సీఓ మహబూబాబాద్‌కు ఆరు దరఖాస్తులు అందాయి. వీటిలో ఉద్యోగానికి సంబంధించి రెండు, డిప్యూటేషన్‌కు రెండు, కారుణ్య నియామకానికి ఒకటి, ఇతర సమస్యకు ఒక దరఖాస్తు ఉన్నాయి.గిరిజన సంక్షేమ శాఖ ఈఈకి ఆరు దరఖాస్తులు అందాయి. హరిచంద్రు తండా గ్రామపంచాయతీ పరిధిలో మట్టి రోడ్డు మంజూరు, మరమ్మతులు, గ్రామపంచాయతీ పనులు, అంకంపల్లి గ్రామపంచాయతీలో భవన నిర్మాణ పనులు, హిమాచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వెళ్లే కాలినడక మార్గానికి రోడ్డు మంజూరు, పైప్‌లైన్ పనులకు సంబంధించిన దరఖాస్తులు ఇందులో ఉన్నాయి.ఆర్ఓఎఫ్ఆర్ విభాగానికి మూడు దరఖాస్తులు అందాయి. జిల్లా సహకార అధికారి, ములుగుకు ఒక దరఖాస్తును పంపించారు. శ్రీ ఆంజనేయ ట్రైబల్ సాండ్ క్వారీ కోఆపరేటివ్ సొసైటీలో సుమారు 40 మంది సభ్యులను అన్యాయంగా తొలగించారనే ఆరోపణపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వచ్చిన దరఖాస్తును సంబంధిత అధికారికి పంపించారు.ఎస్‌డీసీ విభాగానికి రెండు, డీడీ గిరిజన సంక్షేమ శాఖకు ఒకటి, వెంకటాపురం తహసీల్దార్‌కు ఒకటి, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రోడ్డు రోలర్ మంజూరు చేయాలని ఒకటి, సామాజిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించి ఒక దరఖాస్తు అందాయి.ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డీడీ గిరిజన సంక్షేమ శాఖ జనార్ధన్, ఏపీఓ ప్రతాప్, ఈఈ ప్రవీణ్, పరిపాలన అధికారి అనిల్‌తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ పశువుల రవాణాకు చెక్

- డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్న 31 పశువులు స్వాధీనం.. ఇద్దరు అదుపులో



మంథని, అక్టోబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి): అక్రమంగా పశువులను తరలిస్తున్న డీసీఎం వ్యాన్‌ను మంథని పోలీసులు పట్టుకుని 31 పశువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మంథని పోలీస్‌స్టేషన్ పరిధిలోని భట్టుపల్లి రోడ్డుపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మంథని ఎస్ఐ ఎన్.సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 5న ఉదయం సుమారు 4 గంటల సమయంలో భట్టుపల్లి రోడ్డుపై పోలీసులు రాత్రి గస్తీ, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భూపాలపల్లి వైపు నుంచి మంథని వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ (టీఎస్ 12 యూడీ 4009)ను ఆపి తనిఖీ చేశారు. వ్యాన్‌లో 22 ఆవులు, 9 ఎద్దులు కలిపి మొత్తం 31 పశువులను ఇరుకుగా కట్టి, తగినంత స్థలం, మేత, నీరు లేకుండా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పశువుల రవాణాకు సంబంధించిన యాజమాన్య పత్రాలు, పశువైద్య ధ్రువపత్రాలు చూపించక పోవడంతో విచారించగా, వాటిని వధ కోసం తరలిస్తున్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో సిద్దిపేటకు చెందిన మహమ్మద్ సద్దాం, కరీంనగర్‌కు చెందిన మహమ్మద్ రిజ్వాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. పంచుల సమక్షంలో డీసీఎం వ్యాన్‌తో పాటు పశువులను స్వాధీనం చేసుకుని, వాటిని భట్టుపల్లిలోని కపిల గోశాలకు సురక్షితంగా తరలించారు. ఈ ఘటనపై మంథని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

- **‘అభయ–మై ట్యాక్సీ సేఫ్’ యాప్ ప్రారంభించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత**
- **ఆటోలు, క్యాబ్‌లకు తప్పనిసరిగా భద్రతా స్టిక్కర్లు.. మహిళల భద్రతకు ప్రాధాన్యత**





వరంగల్, అక్టోబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి): మహిళలు, ప్రయాణికుల భద్రతకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో రూపొందించిన ‘అభయ–మై ట్యాక్సీ సేఫ్’ యాప్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సోమవారం ప్రారంభించారు. ఆటోలు, క్యాబ్‌లలో ప్రయాణించే వారి భద్రతను పెంచడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న భద్రతా సదుపాయాలను వినియోగించుకునేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, ప్రతి పౌరుడి భద్రత విషయంలో బాధ్యత కూడా ఉందన్నారు. ప్రతి ఆటో, క్యాబ్ డ్రైవర్ ‘అభయ–మై ట్యాక్సీ సేఫ్’ స్టిక్కర్‌ను తప్పనిసరిగా వాహనానికి అంటించుకోవాలని సూచించారు. వాహనంపై భద్రతా స్టిక్కర్ కనిపించడం ద్వారా ప్రయాణికుల్లో నమ్మకం కలుగుతుందని తెలిపారు.ఆటో, క్యాబ్ యజమానులు తమ వాహన వివరాలను ‘అభయ–మై ట్యాక్సీ సేఫ్’ యాప్‌లో నమోదు చేసుకుని, సమీప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి స్టిక్కర్లు పొందాలని సూచించారు. డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ముఖ్యంగా మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ట్యాక్సీ డ్రైవర్లకు యాప్ వినియోగ విధానం, ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, ఇతర ప్రయాణికులు కూడా యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. వాహనాలపై ఏర్పాటు చేసే స్టిక్కర్ల ద్వారా యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అత్యవసర సమయంలో భద్రతా సదుపాయాలను వినియోగించుకునేలా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా పోలీసు కళాబృందం నాటక ప్రదర్శన ద్వారా ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించింది.కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సుజాత, వెంకన్న, ట్రాఫిక్ సిబ్బంది, ట్యాక్సీ డ్రైవర్లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాజేడులో పీఆర్టీయూ తెలంగాణ నూతన కార్యవర్గం

- **సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలిపీఆర్సీ అమలు చేయాలి..**
- **ఈహెచ్ఎస్‌లో పూర్తి నగదు రహిత వైద్యం అందించాలి**





ములుగు జిల్లా/వాజేడు, అక్టోబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి): పీఆర్టీయూ తెలంగాణ వాజేడు మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలు, ఉద్యోగుల హక్కులు, విద్యారంగ అభివృద్ధిపై చర్చించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.నూతన మండల అధ్యక్షుడిగా కరుటూరి సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బాల సంధ్య, గౌరవ అధ్యక్షుడిగా షేక్ సిరాజుద్దీన్, మండల మహిళా అధ్యక్షురాలిగా గద్దల యశస్విని, సహాధ్యక్షుడిగా యనమల్ల రాజు, ఉపాధ్యక్షులుగా పబ్బ రమేష్, కార్యదర్శిగా గొల్లపెల్లి విగ్నేష్, మహిళా కార్యదర్శిగా డి.దేవా కరుణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ తెలంగాణ ములుగు జిల్లా అధ్యక్షుడు కొయ్యడ సురేందర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీని వెంటనే అమలు చేయడంతో పాటు పెరుగుతున్న వైద్య ఖర్చుల నేపథ్యంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా పూర్తి స్థాయిలో నగదు రహిత వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, బదిలీలు, సర్వీసు సంబంధిత సమస్యలను పరిష్కరించడంతో పాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సంఘం నిరంతరం కృషి చేస్తుందని సురేందర్ తెలిపారు.నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా, రాష్ట్ర నాయకులు అభినందించారు. వాజేడు మండలంలోని ఉపాధ్యాయులందరినీ సంఘటితం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. తమపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి పోరిక రామన్న నాయక్, రాష్ట్ర సహాధ్యక్షుడు రౌతు రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్వతాల సతీష్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఇరుసవడ్ల జగన్‌కుమార్, జిల్లా సహాధ్యక్షుడు అమిరిశెట్టి సారంగపాణి, జిల్లా ఉపాధ్యక్షులు దయ రాజు రమేష్, చాట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు AGHS విద్యార్థినులు ఎంపిక

- **జిల్లాస్థాయి పోటీల్లో పలు విభాగాల్లో ప్రతిభ.. నవంబర్‌లో సంగారెడ్డిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత**



పెదగొల్లగూడెం, అక్టోబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4న బండారిపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో AGHS పెదగొల్లగూడెం పాఠశాల విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బహుమతులు సాధించారు. ఈ ప్రతిభతో అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నవంబర్‌లో సంగారెడ్డిలో నిర్వహించనున్న జాతీయస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించారు.

తూర్పు అక్షర – 8వ తరగతి

– ట్రయథ్లాన్‌లో ప్రథమ బహుమతి
– లాంగ్ జంప్‌లో ప్రథమ బహుమతి
– 400 మీటర్ల పరుగులో ప్రథమ బహుమతి

బడే హర్షిని – 9వ తరగతి

– ట్రయథ్లాన్‌లో ప్రథమ బహుమతి
– లాంగ్ జంప్‌లో ద్వితీయ బహుమతి

బడే హర్షిత – 9వ తరగతి

– ట్రయథ్లాన్‌లో ద్వితీయ బహుమతి
– లాంగ్ జంప్‌లో తృతీయ బహుమతి
– కిడ్స్ జావెలిన్ త్రోలో ద్వితీయ బహుమతి

విద్యార్థినుల విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇర్ప కేశవరావు, ఉపాధ్యాయులు పూనెం రోజారాణి, పాయం తిరుపతమ్మ, పెండకట్ల బుచ్చిబాబు, తోలేం కృష్ణయ్య, అట్టం రామారావు, కోడె భారతి, యాలం ఉమాదేవి, అరేం సౌజన్య, మైపతి రావు సృజన, గొంది కవిత, యాలం ధనలక్ష్మి , ఇర్ప గౌతమి, ఫిజికల్ డైరెక్టర్ గుండ్ల రాజు తదితరులు విద్యార్థినులను అభినందించారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదలతో విద్యార్థినులు జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. రాబోయే పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.
విద్యార్థినుల విజయానికి కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

- **గ్రామాల్లో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన సమావేశాలు**





వరంగల్ / సంగెం, అక్టోబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి): సంగెం మండలంలోని నార్లవాయి, మొండ్రాయి, ముమ్మిడివరం, గొల్లపల్లి, ఎల్గూరు రంగంపేట, ఎల్గూరు స్టేషన్, కొత్తగూడెం, గాంధీనగర్, తీగరాజుపల్లి, సోమ్లా తండా గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన సమావేశాలు నిర్వహించారు.ఈ సమావేశాలకు మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని వారు ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీస్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో వేలాది మంది యువత నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు.అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలు చేస్తామని హామీ ఇచ్చి, వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.ఈ కార్యక్రమాల్లో పట్టభద్రులు, ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సమన్వయ కమిటీ సభ్యులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంక్.. ప్రాణభయంతో గ్రామస్తులు

- **తక్షణం పరిశీలించి ప్రమాదకర నిర్మాణాన్ని తొలగించాలని డిమాండ్**





నిజామాబాద్ జిల్లా/ పోతంగల్, అక్టోబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి): పోతంగల్ మండల కేంద్రంలోని పాత పోతంగల్ గ్రామంలో ఉన్న పాత నీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ట్యాంక్ బీమ్‌లకు పెచ్చులు ఊడిపోయి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తుండగా, పిల్లర్లు సైతం బీటలు వారాయి. దీంతో ఏ క్షణంలోనైనా ట్యాంక్ కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నీటి ట్యాంక్ కింద ఇళ్లు, రహదారి ఉండటంతో ప్రమాదం జరిగితే ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతంలో ట్యాంక్ ప్రమాదకరంగా మారడంతో ప్రజలు భయాందోళనల మధ్య ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.ఈ సమస్యపై గ్రామానికి చెందిన బురబోయిన రమేష్ ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో చందర్ నాయక్కు వినతిపత్రం అందజేశారు. శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంక్‌ను వెంటనే పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న నిర్మాణాన్ని తొలగించాలని కోరారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంక్‌ను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు చర్యలు తీసుకుని పెను ప్రమాదం జరగకుండా చూడాలని కోరుతున్నారు.

ముప్పనపల్లిలో పారిశుద్ధ్యం అధ్వానం

- రోడ్లపై చెత్తాచెదారం.. కనుమరుగైన సైడ్ కాలువలునెలలుగా చెత్త బండి రాక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు



కన్నాయిగూడెం, అక్టోబర్05 (నిత్యం నిఘా ప్రతినిధి): కన్నాయిగూడెం మండలంలోని ముప్పనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రోడ్లపై చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. నెలలు గడుస్తున్నా చెత్త సేకరణ వాహనం గ్రామానికి రావడం లేదని ఆరోపిస్తున్నారు. మరోవైపు గ్రామంలోని సైడ్ కాలువలు చెత్తాచెదారం, మురుగుతో నిండిపోవడంతో పాటు వాటిలో దట్టమైన పొదలు పెరిగి పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. కాలువల నిర్వహణపై అధికారులు, గ్రామపంచాయతీ పాలకులు దృష్టి సారించకపోవడంతో సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ పాలన కొనసాగుతున్నప్పటికీ పారిశుద్ధ్య పరిస్థితుల్లో మాత్రం ఆశించిన మార్పు కనిపించడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. రోడ్లపై చెత్త పేరుకుపోవడం, కాలువలు పూడుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.తక్షణమే అధికారులు స్పందించి గ్రామంలోని సైడ్ కాలువలను శుభ్రం చేయడంతో పాటు రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. క్రమం తప్పకుండా చెత్త సేకరణ చేపట్టి గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సింగరేణి భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు

- అనుమతులు లేకుండా తవ్వకాలు..
- 8 మంది అరెస్ట్.. జేసీబీ, నాలుగు ట్రాక్టర్లు స్వాధీనం




పెద్దపల్లి జిల్లా /మంథని, అక్టోబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి): సింగరేణి భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న ఎనిమిది మందిని మంథని పోలీసులు సోమవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఒక జేసీబీతో పాటు నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. రచ్చపల్లి గ్రామ శివారులోని సింగరేణి భూముల్లో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో మంథని ఎస్సై ఎన్. సందీప్ కుమార్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. అక్కడ జేసీబీతో మట్టి తవ్వి నాలుగు ట్రాక్టర్లలో నింపుతున్న ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సింగరేణి భూముల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వి వాణిజ్య ప్రయోజనాల కోసం విక్రయిస్తున్నట్లు విచారణలో నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ మట్టి తవ్వకాలకు ఉపయోగించిన జేసీబీ, నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ, సంస్థలకు చెందిన భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎన్. సందీప్ కుమార్ హెచ్చరించారు.



ములుగు జిల్లా సర్పంచుల ఫోరం కార్యదర్శిగా మొగిలిపల్లి రవీందర్

- లింగాల సర్పంచ్‌కు కీలక బాధ్యత.. అభినందించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు





ములుగు జిల్లా /తాడ్వాయి, అక్టోబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా సర్పంచుల ఫోరం కార్యదర్శిగా తాడ్వాయి మండలంలోని లింగాల గ్రామ పంచాయతీ సర్పంచ్ మొగిలి పల్లి రవీందర్ ఎన్నికయ్యారు. ఆయన కృషి, పట్టుదల, కార్యదీక్షను గుర్తించి ఈ బాధ్యత అప్పగించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. కొత్త బాధ్యతతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. పార్టీకి విధేయుడిగా ఉంటూ కార్యకర్తలకు అండగా నిలిచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తాను మధ్యతరగతి రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని, ప్రజల కష్టాలను దగ్గరగా చూసినవాడినని పేర్కొన్నారు.ములుగు జిల్లాలో అభివృద్ధి జరుగుతోందంటే మంత్రి దనసరి సీతక్క కృషి ప్రధాన కారణమని రవీందర్ అన్నారు. మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధిని ఆచరణలో చూపించడంలో మంత్రి సీతక్క ముందున్నారని కొనియాడారు. పనిలో చురుకుదనం, నిబద్ధత ఉంటే పదవులు వాటంతట అవే వస్తాయని, కాంగ్రెస్ పార్టీలో ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందని అన్నారు.ప్రస్తుతం తమ ముందున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే కార్యకర్తలు కార్యాచరణ ప్రారంభించాలని సూచించారు. మారుమూల ప్రాంతానికి చెందిన తనను గుర్తించి జిల్లా సర్పంచుల ఫోరం కార్యదర్శిగా అవకాశం కల్పించిన మంత్రి సీతక్కకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని రవీందర్ తెలిపారు. ఆమె ఆశీస్సులతో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు.ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రవీందర్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. తనను సన్మానించిన ప్రతి ఒక్కరికీ రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

జోగినుల బతుకుల్లో మార్పు రావాలి

- పెన్షన్, ఇళ్లతో పాటు ప్రభుత్వ పథకాలు అందించాలని వినతి



హనుమకొండ, అక్టోబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లాలో జోగిని, బసివిని, మాతాంగి, శివసత్తులుగా జీవిస్తున్న మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వారి జీవితాల్లో ఆశించిన మార్పు రావడం లేదని పేర్కొన్నారు. బాధితులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు వినతి పత్రం అందజేసి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ.. జోగిని, బసివిని, మాతాంగి, శివసత్తులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దేవుడి పేరుతో కొనసాగుతున్న ఆచారాల కారణంగా అనేక సంవత్సరాలుగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారి జీవనోపాధి, సామాజిక భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతిగా పనిచేస్తున్నామని చెబుతున్న నేపథ్యంలో జోగినులకు నెలకు రూ.5 వేల సామాజిక పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన జోగిని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ అందించాలని కోరారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జోగినుల సమస్యలను విస్మరించిందని ఆయన ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, రాజ్యాంగం అమల్లోకి వచ్చి ఇన్నేళ్లు అయినా అట్టడుగు వర్గాల ప్రజల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదన్నారు. జోగినులు, మాతాంగి, శివసత్తుల కోసం ప్రత్యేక సంక్షేమ చర్యలు చేపట్టి వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించాలని కోరారు.కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు రాంచందర్‌రావు, డిబీఎఫ్ జిల్లా కార్యదర్శి బౌతు రాధ, జిల్లా ఉపాధ్యక్షుడు చుంచు నరేష్, జిల్లా నాయకులు దుర్గం పుష్పలత, చుంచు భరత్, గుండెల్లి సోమలక్ష్మి , శ్రీపతి రాధిక, బౌతు భాగ్య, అడేపు రమ తదితరులు పాల్గొన్నారు.

"కుక్కకున్న విశ్వాసం కూడా మనిషికి లేదా..?"

- ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశారంటూ యువతి సంచలన ఆరోపణలు
- చైర్మన్ కుమారుడిపై తీవ్ర ఆరోపణలు.. న్యాయం కోసం యువతి పోరుబాట
- యువతికి అండగా వర్ధన్నపేట యువత.. వంటావార్పుతో నిరసన







వరంగల్/ వర్ధన్నపేట,అక్టోబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి): "ఒకరోజు నా చేతితో అన్నం పెడితే తిన్న వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఇంటి కుక్క సైతం విశ్వాసం చూపుతుంది.. కానీ నన్ను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించిన వ్యక్తి మాత్రం నన్ను మోసం చేసి తప్పించుకుని తిరుగుతున్నాడు" అంటూ ఓ యువతి చేసిన వ్యాఖ్యలు వర్ధన్నపేటలో తీవ్ర చర్చకు దారితీశాయి. వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి కుమారుడు పాలకుర్తి శ్రీకాంత్ తనను ప్రేమించి, వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని యువతి ఆరోపించింది. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేసింది."శ్రీకాంత్ నన్ను వివాహం చేసుకునే వరకు వెనక్కి తగ్గను. నాలాగా మరో యువతి మోసపోకూడదు. న్యాయం జరిగే వరకు ఎంతదూరమైనా వెళ్తా" అంటూ ఆమె తీవ్రంగా పేర్కొంది. తన ఆరోపణలపై న్యాయం కోసం అవసరమైతే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని యువతి వెల్లడించింది. "నా ప్రాణాలను సైతం లెక్కచేయను" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు స్థానికంగా తీవ్ర చర్చకు కారణమయ్యాయి.

యువతికి అండగా యువత.. వంటావార్పుతో నిరసన

యువతి చేస్తున్న పోరాటానికి మద్దతుగా వర్ధన్నపేటకు చెందిన పలువురు యువత, మహిళలు ఆమెకు అండగా నిలిచారు. వంటావార్పు నిర్వహిస్తూ నిరసన వ్యక్తం చేశారు. బాధిత యువతికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

"న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గను"

తనపై జరిగినట్లు ఆరోపిస్తున్న అన్యాయంపై తుది వరకు పోరాడతానని యువతి స్పష్టం చేసింది. "నన్ను నమ్మించి మోసం చేసిన వారికి సమాధానం చెప్పే వరకు, నాకు న్యాయం జరిగే వరకు నా పోరాటం కొనసాగుతుంది" అని ఆమె పేర్కొంది. అయితే యువతి చేసిన ఆరోపణలపై పాలకుర్తి శ్రీకాంత్ లేదా ఆయన కుటుంబ సభ్యుల వివరణ వెలువడాల్సి ఉంది. ఆరోపణలు నిర్ధారణ కావాల్సి ఉంది.

మడికొండలో ఘనంగా కర్ర పూజ

- దుర్గా శక్తి యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమం



మడికొండ,అక్టోబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి): మడికొండ గ్రామంలో శ్రీ దుర్గా శక్తి యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కర్ర పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువత సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆవాల రాధికా రెడ్డి, పల్లపు అర్జున్, పల్లపు మహేష్, పల్లపు రాజేందర్, దువ్వ శ్రీకాంత్, వస్కుల శంకర్, వస్కుల నాగరాజు, రొడ్డ దయాకర్, ఆకుతోట ప్రశాంత్, బిల్ల రవి, వెన్నమాల రమేష్, ఓర్సు రాజు తదితరులు పాల్గొన్నారు

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

మిత్రుడి తండ్రి మృతి.. కుటుంబానికి అండగా నిలిచిన మిత్రబృందం!

- **కష్టకాలంలో 'మేమున్నాం' అంటూ భరోసా.. విద్యాజ్యోతి యూత్ అసోసియేషన్ మానవత్వం**



వరంగల్/ వర్ధన్నపేట,అక్టోబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి): మిత్రుడి కుటుంబానికి కష్టం వస్తే మేమున్నామంటూ అండగా నిలవాలి.. ఆపదలో తోడుగా ఉండటమే నిజమైన స్నేహానికి నిదర్శనం అంటూ విద్యాజ్యోతి యూత్ అసోసియేషన్ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు.వర్ధన్నపేట మండలం కొత్తపెల్లి గ్రామానికి చెందిన దొమ్మటి మల్లేశం గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన కుటుంబాన్ని విద్యాజ్యోతి యూత్ అసోసియేషన్ సభ్యులు పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మల్లేశం గౌడ్ కుటుంబానికి తమ వంతు అండగా ఉంటామని, కష్టసమయంలో ఒంటరిగా భావించాల్సిన అవసరం లేదని మిత్రబృందం భరోసా ఇచ్చింది. మిత్రుడి కుటుంబం తమ కుటుంబమేనని, యూత్ సభ్యుల కుటుంబాల్లో ఎవరికి ఆపద వచ్చినా ముందుండి సహాయం చేస్తామని సభ్యులు స్పష్టం చేశారు.స్నేహం అంటే సంతోషాల్లో కలిసి నవ్వడమే కాదు.. కష్టాల్లో కన్నీళ్లు తుడిచి, బాధిత కుటుంబానికి చేదోడువాదోడుగా నిలవడమే అసలైన స్నేహమని విద్యాజ్యోతి యూత్ అసోసియేషన్ సభ్యులు తమ ఆచరణతో చాటిచెప్పారు.ఈ కార్యక్రమం ద్వారా యువతలో పరస్పర సహకారం, మానవత్వం, సామాజిక బాధ్యత మరింత బలపడాలని పలువురు ఆకాంక్షించారు.

భూదాన పత్రం ఎలా? యజమాని ప్రశ్న

- **మానసిక అనారోగ్యంతో ఉన్న తండ్రితో పత్రం రాయించుకున్నారంటూ ఆరోపణలు**
- **కుటుంబ సభ్యుల అంగీకారం లేకుండా భూమి వినియోగంపై అభ్యంతరం.. సమగ్ర విచారణకు డిమాండ్**



వర్ధన్నపేట, అక్టోబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట పట్టణంలోని రామాలయం పరిసరాల్లోని ఓ భూమి వ్యవహారం వివాదాస్పదంగా మారింది. తమ తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని భూ యజమాని గురిజాల ప్రశాంత్ ఆరోపించారు. తన తండ్రి మానసిక అనారోగ్యంతో ఉన్న సమయంలో ఆయనతో భూదాన పత్రం రాయించుకున్నారని, ఆ పత్రంపై తనతో పాటు తన తల్లి, ఇతర కుటుంబ సభ్యుల సంతకాలు లేవని పేర్కొన్నారు.

కుటుంబ సభ్యుల అంగీకారం లేకుండానే ఎలా?

కుటుంబానికి సంబంధించిన భూమిని దానం చేయడం, ఇతర ప్రయోజనాలకు బదలాయించడం వంటి అంశాల్లో హక్కులు, పత్రాల చట్టబద్ధత, అంగీకారాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించాలని ప్రశాంత్ కోరారు. కుటుంబ సభ్యులకు సమాచారం లేకుండా తన తండ్రితో భూదాన పత్రం ఎలా రూపొందించారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

భూదాన పత్రం రూపొందిన సమయంలో తన తండ్రి ఆరోగ్య పరిస్థితి ఏమిటి? పత్రం ఏ విధంగా నమోదు అయింది? సంబంధిత నిబంధనల ప్రకారం ప్రక్రియ పూర్తయిందా? అనే అంశాలపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

తమ భూమిలో పనులు.. తమకే సమాచారం లేదా?

తాము మరో ప్రాంతంలో నివసిస్తున్న సమయంలో తమ భూమిని క్రీడా ప్రాంగణంగా మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయని ప్రశాంత్ ఆరోపించారు. విషయం తెలిసి తాను ప్రశ్నించడంతో అప్పట్లో పనులు నిలిచిపోయాయని తెలిపారు. తాజాగా అదే స్థలంలో తమకు సమాచారం ఇవ్వకుండా శాశ్వత సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిసిందని, దీంతో సంబంధిత మున్సిపల్ అధికారులను ప్రశ్నించినట్లు చెప్పారు.

ప్రశ్నిస్తే బెదిరింపులు చేశారంటూ ఆరోపణ

ఈ విషయంపై మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణికి ఫోన్ చేసి వివరాలు అడిగానని ప్రశాంత్ తెలిపారు. అయితే చైర్మన్ తనతో దురుసుగా మాట్లాడటంతో పాటు అసభ్య పదజాలం ఉపయోగించారని, పోలీసులతో కొట్టిస్తానని, జైలుకు పంపిస్తానని బెదిరించినట్లు ఆయన ఆరోపించారు. తాను ఎమ్మెల్యే, ఎంపీలను దూషించినట్లు తన మాటలను వక్రీకరించారని ప్రశాంత్ పేర్కొన్నారు. ఫోన్ సంభాషణకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని, వాటిని మీడియా దృష్టికి తీసుకువస్తున్నట్లు తెలిపారు.

విచారణతోనే వాస్తవాలు తేలాలి

భూమి హక్కులు, భూదాన పత్రం చట్టబద్ధత, నిర్మాణ పనులకు ఉన్న అనుమతులు, భూమి వినియోగానికి సంబంధించిన అంశాలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రశాంత్ డిమాండ్ చేశారు. తన తండ్రి పరిస్థితి, భూదాన పత్రం రూపొందిన విధానం, కుటుంబ సభ్యుల అంగీకారం తదితర అంశాలను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు. తనను బెదిరించినట్లు చేస్తున్న ఆరోపణలపైనా ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. కాగా, భూ యజమాని గురిజాల ప్రశాంత్ చేసిన ఆరోపణలపై మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి వివరణ వెలువడాల్సి ఉంది. ఆరోపణలపై అధికారిక విచారణ అనంతరం వాస్తవాలు తేలాల్సి ఉంది.

ఘనంగా గ్యారల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు

- **పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ నాయకులు జిఎస్ సేవాసమితి**
- **చైర్మన్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు పసుమాముల పరిధిలోని స్వర్ణ మహల్ లో ఘనంగా నిర్వహణ.**





నిత్యం నిఘా, అబ్దుల్లాపూర్ మెట్, అక్టోబర్ 05 :
అబ్దుల్లాపూర్ మెట్; పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ నాయకులు జి.ఎస్. సేవాసమితి చైర్మన్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు పసుమాముల పరిధిలోని స్వర్ణ మహల్ లో ఘనంగా నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. మంచి భవిష్యత్తు ఉన్న నాయకుడు శ్రీనివాస్ గౌడ్ ఇంకా భవిష్యత్తులో ప్రజా సేవలో చురుగ్గా పాల్గొనాలని ఆ భగవంతుడు ఆయనకు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని మంచి రాజకీయ భవిష్యత్తు ఉన్న యువకుడని అన్నారు. తదానంతరం గ్యారల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, అధికారులు, అభిమానులు, సందడితో పండుగ వాతావరణం నెలకొంది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ

- **రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి**



నిత్యం నిఘా, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 5 : ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న పేద ప్రజలకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సహకారంతో ,కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకులు డిసిసి జనరల్ సెక్రటరీ మంకాలశేఖర్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం రోజున గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల యాదగిరి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మ్యాకంమధు 60 వేల రూపాయలు మంకాలరవీందర్ రెడ్డి 60 వేల రూపాయలు ఒలాస్ నరసింహ 19500వారి నివాసానికి వెళ్లి అందజేయడం జరిగింది ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఒక వరం లాంటిదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఎలిమినేడు గ్రామంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు అయ్యేలా కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టలయాదగిరి పట్నం శివశంకర్ ఎక్కే మహేందర్ ఆర్కే బలరాం స్వామి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గట్టు ఇప్పలపల్లిలో ఘనంగా జాతీయ పోషణ మాసోత్సవం

- **పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం**
- **సీడీపీఓ శాంతిరేఖ-సూపర్‌వైజర్ తిరుమల,**



నిత్యం నిఘా, తలకొండపల్లి, అక్టోబర్ 5 : తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామంలో సోమవారం 9వ జాతీయ పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీఓ (CDPO) శాంతిరేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "మన అంగన్‌వాడీ – మన బాధ్యత" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కేంద్రాల్లో మెనూ ప్రకారం అందించే సమతుల్య మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.చిన్నారుల బాల్య సంరక్షణతో పాటు వారికి అందించే పూర్వ ప్రాథమిక విద్య (ప్రీ–స్కూల్) ప్రాధాన్యతను తల్లులకు వివరించారు. అనంతరం గ్రామంలో సామాజిక వేడుకలను నిర్వహించారు.ఇందులో భాగంగా గర్భిణులకు శ్రీమంతాలు (ఆహార వితరణ), చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను శాంతిరేఖ చేతుల మీదుగా వైభవంగా జరిపారు.ఈ కార్యక్రమంలో గట్టు ఇప్పలపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సైదమ్మ, అంగన్‌వాడీ సూపరవ:ైజర్ తిరుమల, గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఉషశ్రీ, సునీత,ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ మహిళలు మరియు కిశోర బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం

- **భారీ మార్చ్‌కు తరలిరావాలి.. తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపు**

నిత్యం నిఘా, మేడ్చల్ మల్కాజ్గిరి, అక్టోబర్ 05 : జిల్లా కేంద్రంలో అక్టోబర్ 6న నిర్వహించనున్న భారీ మార్చ్, నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో కలిసి భారీ మార్చ్‌లు, కలెక్టరేట్ల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ, బీసీ, మైనారిటీ సెల్‌ల నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కార్యక్రమాన్ని తమ బాధ్యతగా భావించి హాజరై విజయవంతం చేయాలని వజ్రేష్ యాదవ్ కోరారు.మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఉదయం 11 గంటలకు భారీ మార్చ్, నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com